


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4PM

www.suryaa.com

మంగళవారం

02-12-2025

పేజీలు: 02




## ఐపీఎల్ వేలానికి గ్లెన్ మ్యాక్స్‌వెల్ దూరం

ఇండియన్ ప్రీమియర్ లీగ్ కోసం జరిగే ఆటగాళ్ల వేలానికి ఆస్ట్రేలియా క్రికెటర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ దూరం అయ్యారు. క్రికెటర్ల వేలానికి అందుబాటులో ఉండడం లేదని ఆసీస్ బ్యాటర్ ఇవాళ ప్రకటించాడు. డిసెంబర్ 16వ తేదీన అబుదాబిలో ఐపీఎల్ ప్లేయర్ల వేలం జరగనున్నది. అయితే ఐపీఎల్‌లో అతను 2012 సీజన్ నుంచి ఆడుతున్నాడు. హిట్టర్‌గా పేరుగాంచిన మ్యాక్స్‌వెల్ 2019 సీజన్‌లో మాత్రం ఆడలేదు. ఇక అతను 141 మ్యాచుల్లో కేవలం 2819 రన్స్ మాత్రమే చేవాడు. అతనికి స్ట్రయిక్ రేట్ 155 ప్లస్‌గా ఉన్నది. బ్యాటింగ్ యావరేజ్ 24గా ఉంది. అయితే ఐపీఎల్ వేలంలో అతనికి ఫ్రాంచైజీలు ఎక్కువే సమర్పిస్తున్నా.. మ్యాక్స్‌వెల్ మాత్రం ఆశించిన రీతిలో సక్సెస్ సాధించలేదు. స్పిన్ బౌలింగ్ వేసే మ్యాక్స్‌వెల్ .. ఐపీఎల్‌లో కేవలం 41 వికెట్లు తీసుకున్నాడు. ఐపీఎల్‌లో ఎన్నో మరుపురాని సీజన్స్ ఆడానని, అయితే ఈ ఏడాది జరిగే ఆటగాళ్ల వేలానికి తమ పేరును సమర్పించడం లేదని మ్యాక్స్‌వెల్ తన సోషల్ మీడియా అకౌంట్‌లో ప్రకటించాడు. తాను తీసుకున్నది పెద్ద నిర్ణయమని, ఐపీఎల్ లీగ్ తనకు ఎంతో పేరుప్రఖ్యాతలు తీసుకువచ్చిందన్నారు. ఓ క్రికెటర్‌గా, ఓ వ్యక్తిగా తనను ఐపీఎల్ తీర్చిదిద్దినట్లు మ్యాక్స్ తన ఇన్‌స్టా పేజీలో చెప్పాడు.



## పవన్ కల్యాణ్‌కి మంత్రి కోమటిరెడ్డి వార్నింగ్

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ 'నర దిష్టి' వ్యాఖ్యలపై తెలంగాణలో రాజకీయ దుమారం చెలరేగుతోంది. ఈ వ్యాఖ్యలపై తెలంగాణ ప్రతిపక్ష నేతలతో పాటు కాంగ్రెస్ మంత్రులు మూకుమ్మడిగా దాడికి దిగారు. తాజాగా తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా పవన్ కళ్యాణ్‌కి వార్నింగ్ ఇచ్చాడు. 'నర దిష్టి' అంశంలో పవన్ కల్యాణ్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని తెలంగాణ ప్రజలను అవమానిస్తే ఊరుకోమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్రంగా స్పందించారు.పవన్ కల్యాణ్ తెలంగాణ ప్రజలను అవమానించే విధంగా చేసిన 'నర దిష్టి' వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణలు చెప్పాలి. ఆయన వెంటనే క్షమాపణలు చెప్తే, తెలంగాణలో ఆయన సినిమాలు కనీసం ఒకటి రెండు రోజులైన ఆడే అవకాశం ఉంటుంది. లేదంటే, సినిమాటోగ్రఫీ మంత్రిగా చెబుతున్నాను, తెలంగాణలో ఆయన సినిమాలు ఆడనివ్వం అంటూ కోమటిరెడ్డి వార్నింగ్ ఇచ్చాడు.



# గద్వాల ఎస్టీ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్

### 12 మంది విద్యార్థులకు అస్వస్థత, ఒకరికి సీరియస్


ప్రభుత్వ హాస్టళ్లలో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకుంటున్నప్పటకీ రేవంత్ రెడ్డి సర్కార్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నా, ప్రాణాలు కోల్పోతున్నా పట్టించుకోవడం లేదు. తాజాగా గద్వాల ఎస్టీ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ జరిగింది. కలుషిత ఆహారం తినడంతో 13 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో సిబ్బంది వారిని గద్వాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మెనూ సక్రమంగా లేదని అధికారులకు తెలియజేసిన పట్టించుకోకపోవడం వల్లే ఈ ఘటన జరిగిందని విద్యార్థులు తెలిపారు. ఉదయం ఉప్మా వండిన తర్వాత దాంట్లో పురుగులు ఉన్నాయని హాస్టల్ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లామని, దీంతో దానిని పారబోశారని చెప్పారు. అంతకుముందు దానిని తిన్న వారు అస్వస్థతకు గురయ్యారని పేర్కొన్నారు. వసతి గృహంలో మొత్తం 120 మంది విద్యార్థులు ఉన్నారు.

## పట్టువదలని విక్రమార్కుడు.. ఈ 3 అడుగుల డాక్టర్





డాక్టర్ గణేశ్ బర్రైయ్యాను చూశారా? ఈయన ఎత్తు మూడు అడుగులే. కానీ పట్టుదల ఉన్న వ్యక్తి. ఎలాగైన వైద్య విద్య చేయాలనుకున్నాడు. సుప్రీంకోర్టులోనూ కేసు గెలిచి .. తన మెడికల్ కోర్సు పూర్తి చేశాడు. ఇప్పుడు ప్రభుత్వ ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. అంగవైకల్యం తన కలకు అడ్డు కాదు అని నిరూపించుకున్నాడు. పేదల సేవలో నిమగ్నమైన ఆ డాక్టర్ ఇప్పుడో సక్సెస్ స్టోరీకి నిదర్శనం. ఎత్తు తక్కువ.. శారీరక ఆరోగ్యం కూడా బలహీనమే. దీంతో ఎంబీబీఎస్ చదవాలన్న అతని ఆశయానికి ఎదురుదెబ్బ తగిలింది. 2018లో ఎంబీబీఎస్ చదవాలనుకున్న సమయంలో ఎంసీఐ అతనికి అడ్మిషన్ ఇవ్వలేదు. గణేశ్ అంగవైకల్యాన్ని దృష్టిలో పెట్టుకుని అడ్మిషన్‌ను నిరాకరించారు. 72 శాతం వైకల్యంతో ఉన్న గణేశ్ తన కలను నిజం చేసుకునేందుకు తీవ్ర న్యాయ పోరాటం చేశాడు. అవరోధాలు ఎన్ని ఎదురైనా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదతను. గుజరాత్‌లోని ఓ గ్రామంలో ప్రైవేటు విద్యను అభ్యసించినట్లు చెప్పాడు. 2018లో నీట్ యూజీ పరీక్షను రాశాను, కానీ తన వైకల్యం దృష్ట్యా.. మెడికల్ కౌన్సిల్ తనకు అడ్మిషన్ ఇవ్వలేదన్నాడు. ఆ సమయంలో తీవ్ర నిరాశకు లోనయ్యానన్నాడు. గుజరాత్ హైకోర్టులో కేసు ఓడిపోయాము. అయితే మళ్లీ సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేశాం. వైకల్యం కారణంగా సీటు దక్కకపోవడం దారుణమని, మీ విద్యాభ్యాసాన్ని ఎవరూ అడ్డుకోలేరని, 2019లో సీటు రిజర్వ్ చేసి ఉంటుందని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొన్నది. లీగల్ చిక్కుల్ని దాటిన గణేశ్ ఎట్టకేలకు వైద్యవిద్యను పూర్తి చేశారు. ప్రస్తుతం భావనగర్‌లోని సర్ తక్త్ సిన్‌జీ సివిల్ ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్‌గా వైద్య సేవలు అందిస్తున్నారు. స్థానికులకు బీపీ చెక్ చేస్తూ.. మందులు ఇస్తూ తన వైద్య వృత్తిని కొనసాగిస్తున్నారు.





## తుంబాడ్' దర్శకుడి కొత్త చిత్రం.. 'మయసభ' విడుదల తేదీ ఖరారు!

తుంబాడ్' వంటి హారర్-ఫాంటసీ చిత్రంతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న రచయిత, దర్శకుడు రాహి అనిల్ బార్వే తన తదుపరి చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం 'మయసభ: ది హాల్ ఆఫ్ ఇల్యూజన్'. ఈ సినిమాలో జావేద్ జాఫేరీ ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా.. వీణా జాంకర్, దీపక్ దామ్లే, మహమ్మద్ సమద్ కీలక పాత్రల్లో నటించబోతున్నారు. పికల్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ సమర్పిస్తుండగా.. జిర్కాన్ ఫిల్మ్స్ పీ లిమిటెడ్ నిర్మిస్తోంది. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమాను జనవరి 16న 2026 ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.





## సిర్‌పై చర్చ చేపట్టాలని విపక్షాల ఆందోళన

పార్లమెంట్ ఆవరణలో ఇవాళ విపక్ష సభ్యులు .. సిర్ ప్రక్రియకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఓటర్ల జాబితా సవరణ కాంక్షిస్తూ.. కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తమ నిరసన కొనసాగిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే అన్నారు. పార్లమెంట్ ఆవరణలో ఇవాళ జరిగిన నిరసన ప్రదర్శనలో రాహుల్ గాంధీ, సోనియా గాంధీ కూడా పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నట్లు కాంగ్రెస్ నేతలు ఆరోపించారు.

## రేవంత్ హామీలు గాలికి.. బీఆర్‌ఎస్ నేత మధుసూదన్ ధ్వజం!





ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తాతా మధుసూదన్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కటీ అమలు చేయకుండా, ముఖ్యంగా బీసీల రిజర్వేషన్ల విషయంలో తీవ్రంగా మోసం చేశారని ఆయన ఆరోపించారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, బీసీ సామాజిక వర్గాన్ని రాజకీయంగా దారి తప్పించే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ఖమ్మం జిల్లా నుండి ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ జిల్లాలో అభివృద్ధి పేరుతో ఏ ఒక్క పనీ జరగలేదని తాతా మధు విమర్శించారు. పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సీఎం రేవంత్ రెడ్డి ఖమ్మం పర్యటన చేయడం వెనుక ప్రజలపై ఒత్తిడి పెంచి, రాజకీయ లబ్ధి పొందే కుట్రే ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఇది ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించే చర్యగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం వెంటనే స్పందించి ముఖ్యమంత్రి పర్యటనను ఆపివేయాలని తాతా మధుసూదన్ డిమాండ్ చేశారు. లేకపోతే బీఆర్ఎస్ పార్టీ తరఫున రోడ్డెక్కి నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ప్రజలు ఈ రాజకీయ నాటకాలకు లొంగకూడదని, కాంగ్రెస్ హామీల మోసాన్ని గుర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతున్న నేపథ్యంలో ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ నేతల ఈ ఆవేదన పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్తేజాన్ని నింపనుంది. పంచాయతీ ఎన్నికల్లో ఈ అంశం ప్రధాన ఎన్నికల అస్త్రంగా మారే అవకాశం కనిపిస్తోంది.



## శబరిమలకు పోటెత్తుతున్న భక్తులు

### 15 రోజుల్లోనే రూ.92 కోట్ల ఆదాయం

కేరళలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శబరిమలకు భక్తులు పోటెత్తుతున్నారు. ఈ ఏడాది మండల- మకరవిళక్కు వేడుకలు గత నెల 17వ తేదీ నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ సీజన్‌లో తొలి 15 రోజుల్లోనే ఆలయానికి భారీగా ఆదాయం సమకూరింది. గతేడాదితో పోలిస్తే 33 శాతం పెరిగింది. మండల- మకరవిళక్కు వేడుకలు ప్రారంభమైన 17వ తేదీ నుంచి ఈనెల 1వ తేదీ అంటే తొలి 15 రోజుల్లో రూ.92 కోట్ల ఆదాయం వచ్చినట్లు ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) తాజాగా వెల్లడించింది. గతేడాది ఇదే సీజన్‌లో రూ.69 కోట్లు వసూలైనట్లు తెలిపింది. గతేడాదితో పోలిస్తే ఈ దఫా ఆదాయం 33.33 శాతం పెరిగిందని పేర్కొంది. ఈ ఏడాది అత్యధికంగా అయ్యప్ప ప్రసాదం విక్రయాల ద్వారానే అధిక ఆదాయం వచ్చినట్లు టీడీబీ తెలిపింది. దాదాపు రూ.47 కోట్లు సమకూరినట్లు వివరించింది.



## పిచ్చెక్కిస్తున్న అనన్య అందాలు

నెపో కిడ్ గా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన అనన్య పాండేను చూసి అందరూ కొన్నాళ్లకే అమ్మడు ఫేడ్ అవుతుందని అనుకున్నారు. కానీ తన టాలెంట్ ను చూపిస్తూ, అందాల ఆరబోతతో సోషల్ మీడియాలో ఫాలోవర్లకు ఎట్రాక్ట్ చేస్తూ తెలివితో కెరీర్లో ముందుకెళ్తుంది. సినిమాల పరంగా పెద్దగా హిట్లు లేకపోయినా అనన్యకు వరుస సినిమాలు రావడానికి కారణమిదే. ఇన్‌స్టాలో రెగ్యులర్ గా తన ఫోటోషూట్లను షేర్ చేసే అనన్య తాజాగా థైస్ షో చేస్తూ ఓ డిఫరెంట్ ఔట్‌ఫిట్ లో కనిపించి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ ఫోటోల్లో అనన్య సింపుల్ హెయిర్ స్టైల్, డీసెంట్ లుక్ తో ఎట్రాక్ట్ చేయగా ఆ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# రోజూ సమాధి దగ్గర తిరుగుతున్న ఓ మహిళ



ఆమెకు తల్లి అంటే ప్రేమ. ఎంతో అనురాగం. అనారోగ్యంతో తల్లి కన్ను మూసింది. అయితే ఆమెకు అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలు ముగిసిన తరువాత అందరూ ఇంటికి వెళ్లిపోయారు. ఈమె మాత్రం వెళ్లకుండా అక్కడే ఉండిపోయారు. సుమారుగా 24 గంటలు అక్కడే ఉండిపోయారు. బలవంతంగా తీసుకొచ్చిన మళ్లీ అక్కడికే వెళ్తామని చెబుతున్నారు. కరీంనగర్‌లోని సవరన్ షీట్ కబరస్థాన్(స్మశాన వాటిక)లో బాధాకర సంఘటన చోటు చేసుకుంది. అజ్మత్‌పూర్‌కు చెందిన హసీనా ఆరోగ్యం బాగా లేదు. కొన్ని రోజుల పాటు చికిత్స పొందారు. ఆరోగ్యం విషమించడంతో కన్ను మూశారు. తల్లి మరణాన్ని తట్టుకోలేక ఆమె కుమార్తె ఆఫ్రిన్ కుమిలిపోయింది. కన్నీరు మున్నీరుగా విలపించారు. తల్లి మరణాన్ని తట్టుకోలేకపోయింది. దీంతో రాత్రి మొత్తం తన తల్లి సమాధి వద్దే కూర్చొని కన్నీళ్లు పెట్టుకుంది. కనీసం 24 గంటల పాటు అక్కడే ఉంది. రాత్రి అక్కడే ఉంటోంది. కుటుంబ సభ్యులు ఎంత వెనక్కి తీసుకొచ్చినా మళ్ళీ అక్కడికే వెళ్తుంది. రాత్రి పూట ఉండటంతో స్థానికులు భయపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆఫ్రిన్ తండ్రి.. కుటుంబ సభ్యులు ఈరోజు ఉదయం స్మశాన వాటికకు చేరుకుని ఆమెను ఇంటికి తీసుకుని వెళ్లారు. ఈ ఘటన స్థానికులను కలచివేసింది. బలవంతంగానే ఇంటికి వెళ్ళింది. ఆమెను ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా జాగ్రత్తగా చూసుకుంటున్నారు కుటుంబం సభ్యులు.



## బాచుపల్లిలో ఇద్దరు ఇంటర్ విద్యార్థుల సూసైడ్

నగరంలోని బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు విద్యార్థులు సూసైడ్ చేసుకున్నారు. వేర్వేరు కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న వీరు ఇలా ఆత్మహత్యకు పాల్పడటం తీవ్ర కలకలం రేపుతోంది. ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న 16 ఏళ్ల ఓ విద్యార్థిని కళాశాలలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమె సొంతూరు మహబూబ్ నగర్ జిల్లా మక్తల్. అయితే.. ఈమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విద్యార్థిని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ప్రగతినగర్‌లో మరో విద్యార్థి..

మరో ఘటనలో బాచుపల్లి పీఎస్ పరిధి ప్రగతి నగర్‌లోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి కూడా బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇంట్లో ఉరివేసుకున్న అతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. శవపరీక్షల కోసం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

## సర్పంచ్ పదవి వేలంలో రూ.28.60 లక్షలకు దక్కించుకున్న అభ్యర్థి!




మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామంలో సోమవారం VDC ఆధ్వర్యంలో సర్పంచ్ పదవికి వేలం పాట జరిగినట్లు మండలంలో జోరుగా చర్చ జరుగుతోంది. ఈ వేలం పాటలో ఇద్దరు అభ్యర్థులు పోటాపోటీగా పాట పాడారని చుట్టుపక్క గ్రామప్రజలు తెలిపారు. ఒక వర్గానికి చెందిన వ్యక్తి రూ.28.60 లక్షలకు సర్పంచ్ పదవిని దక్కించుకున్నాడని సమాచారం. గ్రామంలో మొత్తం 12 మంది నామినేషన్లు వేశారు. వీరందరినీ నామినేషన్ ఉపసంహరించుకోవాలని VDC కోరినట్లు తెలిసింది.

## హయత్‌నగర్‌లో దారుణం..
# మూగ బాలుడిపై వీధి కుక్కల దాడి



హైదరాబాద్‌లోని హయత్‌నగర్ శివగంగ కాలనీలో ఇంటి ముందు ఆడుకుంటున్న ఏడేండ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేశాయి. సుమారు 10 నుంచి 20 కుక్కలు ఎగబడటంతో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. శునకాల దాడిలో అతని చెవి ఊడిపోవడంతోపాటు తల, నడుము, వీపు భాగాల్లో తీవ్రగాయాలయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన తిరుపతిరావు, చంద్రకళ దంపతులు గత మూడేండ్లుగా శివగంగ కాలనీలో కిరాయికి ఉంటున్నారు. వారి కుమారుడు ప్రేమ్‌చంద్ పుట్టుకతో మూగవాడు. మంగళవారం ఉదయం తండ్రి మేస్త్రీ పనికి వెళ్లగా, తల్లి ఇంట్లో నీళ్లు పడుతున్నది. ఈ క్రమంలో ఇంటి బయట ఆడుకుంటున్న ప్రేమ్‌చంద్‌పై ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. గమనించిన స్థానికులు వాటిని తరిమేసి బాలుడిని రక్షించారు. అనంతరం అతడిని నల్లకుంట ఫీవర్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి నుంచి నిలోఫర్‌కు పంపడంతో అత్యవసర వార్డులో చికిత్స అందిస్తున్నారు. కాగా, నగరంలో ప్రతిరోజూ ఏదో ఒక చోట చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేస్తున్నాయని, జీహెచ్ఎంసీ అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.




## రూ.4లక్షల పెట్టుబడికి
# గుంట భూమి

రియల్ ఎస్టేట్ వెంచర్‌లో పెట్టుబడులు పెడితే భారీగా సొమ్ము తిరిగొస్తుందని మభ్యపెట్టిన మరో సంస్థ బోర్డు తిప్పేసింది. ఒకసారి రూ.4 లక్షలు పెట్టుబడి పెడితే.. ఒక గుంట భూమి, 25 నెలల పాటు నెలకు రూ.16 వేల వడ్డీ, ఆ గడువు ముగియగానే రూ.8 లక్షలు నగదు ఇస్తామని ఘరానా మోసానికి పాల్పడింది. కానీ కొంత మందికే వడ్డీ చెల్లించడం, రిజిస్ట్రేషన్ చేసిన భూమి ఏదీ చూపకపోవడంతో.. మోసపోయామని గుర్తించిన బాధితులు సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆందోళనకు దిగారు. గతంలో ఇదే సంస్థపై సైబరాబాద్ పరిధిలోని ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ)లో కేసు నమోదవడం గమనార్హం.



## హైదరాబాద్ మెట్రో షాకింగ్ డెసిషన్..
# ట్రాన్స్‌జెండర్లకు కీలక బాధ్యతలు

3హైదరాబాద్ మెట్రో ఎప్పటికప్పుడు ఏదోక కొత్త నిర్ణయం తీసుకుంటోంది. ప్రయాణికులకు మెరుగైన ప్రయాణం అందించేందుకు అనేక సౌకర్యాలు ప్రవేశపెట్టడంతో పాటు నిర్వహణపరంగా కూడా అనేక నిర్ణయాలు తీసుకుంటూ ముందుకెళ్తుంది. అందులో భాగంగా తాజాగా హైదరాబాద్ మెట్రో మరో నిర్ణయం తీసకుంది. 20 మంది ట్రాన్స్‌జెండర్లను సెక్యూరిటీ గార్డ్‌లుగా నియమించింది. అందరికీ సమాన అవకాశాలు కల్పించడం, మహిళలకు భద్రత కల్పించడంలో భాగంగా ఈ ముందడుగు వేసినట్లు స్పష్టం చేసింది. మహిళల భద్రతను బలోపేతం చేయడంతో పాటు వారికి గౌరవం, భరోసా కల్పించడంలో భాగంగా ఇదొక వ్యూహాత్మక ప్రయత్నంగా అధికారులు చెబుతున్నారు. 20 మంది ట్రాన్స్‌జెండర్లు ఇప్పటికే ట్రైనింగ్ పూర్తి చేసుకున్నారు. నేటి నుంచి ఎంపిక చేసిన స్టేషన్లు, మెట్రో రైళ్ల లోపల విధులు నిర్వర్తించనున్నారు. మెట్రో రైలు మొత్తం మూడు కారిడార్లలో 57 స్టేషన్లతో నడుస్తోంది. రోజూ దాదాపు 5 లక్షల మంది ప్రయాణికులు సేవలను వినియోగించుకుంటున్నారు. వీరిలో దాదాపు 30 శాతం మంది మహిళలు ఉంటున్నారు. దీంతో వారికి భద్రత, సౌకర్యాలు కల్పించడంపై మెట్రో దృష్టి సారించింది. మహిళల భద్రతను బలోపేతం చేయడం వారికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ట్రాన్స్‌జెండర్లను సెక్యూరిటీ గార్డులుగా నియమించడం అందులో భాగమేనని తెలుస్తోంది.



## ఉక్రెయిన్ చర్చల్లో కీలక మలుపు

అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్‌తో.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భేటీకానున్నారు. ఉక్రెయిన్ యుద్ధానికి అంతం పలికేందుకు ఆ ఇద్దరు భేటీకానున్నారు. అయితే శాంతి ఒప్పందంపై ఓ అగ్రిమెంట్ జరిగే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్ కూడా ఆ చర్చల్లో పాల్గొనే అవకాశాలు ఉన్నాయి. ఫ్లోరిడాలో రెండు రోజుల పాటు ఉక్రెయిన్ , అమెరికా అధికారుల మధ్య చర్చలు జరిగాయి. విట్‌కాఫ్, కుష్నర్ కూడా ఆ చర్చల్లో పాల్గొన్నారు. అయితే రష్యాకు అనుకూలమైన శాంతి ప్రణాళికను రూపొందించే ఉద్దేశంతో అమెరికా ప్రయత్నాలు చేస్తున్నది.

## భార్యాభర్తలను విడదీసిన వార్డులు.. గందరగోళంగా ఓటర్ల జాబితా



జనగామ జిల్లా లింగాల గణపురం మండలంలో పలు వార్డుల్లో అధికారులు గజిబిజిగా ఓటర్లను చేర్చడం గందరగోళంగా మారింది. అధికారులు ఏ ఇంటి నుంచి ప్రారంభించారో ఏ ఇంట్లో ముగించారో తెలియని పరిస్థితి నెలకొంది. ఒక వార్డుకు చెందిన ఓటర్లు మరో వార్డులో నమోదయ్యారు. దీంతో వార్డుల్లో పోటీ చేసే అభ్యర్థులు ఓటర్లను మిగతా వార్డుల్లో నమోదవ్వడంతో వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. లింగాల గణపురంలో 11వ వార్డులో కడకంచి నరసింహులు పేరు నమోదవగా, అతని భార్య కడకంచి లక్ష్మి పేరు తొమ్మిదో వార్డులో నమోదు చేశారు. ఒకే ఇంటిలో ఉంటున్న భార్యాభర్తలను రెండు వార్డుల్లో చేర్చడంతో ఆ కుటుంబ సభ్యులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకే వీధిలో పక్క పక్కనే ఉన్న మూడు ఇండ్లను అధికారులు మూడు వార్డుల్లో చేర్చి చేతులు దులుపుకున్నారు. మండలం మొత్తం ఇదే పరిస్థితి నెలకొంది. గ్రామ సర్పంచ్ పదవికి ఓటు వేసే సమయంలో గ్రామ మొత్తాన్ని ప్రామాణికంగా తీసుకుంటారు. కానీ, వార్డు విషయానికి వచ్చేసరికి ఆయా వార్డుల్లోని ఓటర్లు మాత్రమే ఆయా వార్డు మెంబర్‌ని ఎన్నుకోవాల్సి ఉంటుంది. దీంతో వార్డు మెంబర్‌గా పోటీ చేసేవారు తమ ఓటర్లను ఇతర వార్డుల్లో ఎత్తుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.



# ఏం అందం రా బాబు

బ్యూటీ మీనాక్షి చౌదరి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. తన అందంతో, గ్లామర్‌తో ఎంతో మందిని ఆకట్టుకుంది ఈ అమ్మడు. ఇచ్చట వాహనములు నిలుపరాదు అనే సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి. అయితే ఈ అమ్మడు మొదటి సినిమా అంతగా హిట్ అవ్వకపోయినప్పటికీ, ఈ బ్యూటీకి మాత్రం మంచి క్రేజ్ వచ్చింది. దీంతో అడవి శేష్ హిట్ 2 మూవీలో ఛాన్స్ కొట్టేసింది. ఇక ఈ మూవీతో ఈ అమ్మ డుకు వరసగా అవకాశాలు దక్కాయి. ఇక ఈ సినిమా తర్వాత గుంటూరు కారం, లక్కీ భాస్కర్ , సంక్రాంతికి వస్తున్నాం వంటి సినిమాల్లో నటించి మెప్పించింది.




## హార్దిక్ పాండ్యా
# వచ్చేస్తున్నాడు..

భారత క్రికెట్ అభిమానులకు గుడ్‌న్యూస్. టీ20 ప్రపంచకప్ హీరో హార్దిక్ పాండ్యా వచ్చేస్తున్నాడు. ఆసియా కప్‌లో గాయం కారణంగా రెండు నెలలకుపైగా జట్టుకు దూరమైన ఈ బరోడా క్రికెటర్‌కు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటి జాతీయ జట్టులోకి పునరాగమనం చేయాలనుకుంటున్నాడు పాండ్యా. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బరోడా తరఫున బరిలోకి దిగనున్నాడీ ఇండియన్ స్టార్. ఆసియా కప్‌లో ఎడమ కాలి తొడకండరాల గాయంతో బాధపడిన పాండ్యా ప్రస్తుతం కోలుకున్నాడు.